క్లుప్తంగా

రేపు పొంగలిపాకలో రావాలమ్మ తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలో పొంగలిపాక గ్రామంలో ఈ నెల 4వ తేదీ రథసప్తమి రోజున గ్రామ ఇలవేల్పు అయిన రావాలమ్మ తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్టు గ్రామానికి చెందిన ఎస్ఆర్‌టీ బాయ్స్, ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం నుంచి తప్పెట గుళ్లు, కోలాటం, చిటికెల భజనలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. రాత్రికి గాజువాక వారి సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

శంభువానిపాలెంలో రేపు ఎడ్ల బళ్ల పోటీలు

దేవరాపల్లి : శంభువానిపాలెంలో పరదేశమ్మ తీర్థం మహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.2వేలు, వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మంగళవారం ఉదయం నుంచి పరదేశమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



జలపాతంలో జలకాలాడుతున్న సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే జలపాతంలో సందర్శకులు జలకాలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. సంహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కేరింతలు కొట్టారు. రెండు జిల్లాల నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో సరుగుడు వెళ్లే రోడ్డులో వాహనాల రద్దీ ఏర్పడింది.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



కొండలఅగ్రహారంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

మాకవరపాలెం : మండలంలోని కొండలఅగ్రహారంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా ఈ ఉత్సవం వైభవంగా జరుపుతారు. ఈ సందర్భంగా ఈ ఏడాది కూడా గ్రామంలోని రామాలయం వద్ద శని, ఆదివారాలు తీర్థాలు జరిగాయి. ఉత్సవం నేపథ్యంలో గ్రామంలో విద్యుత్ దీపాలంకరణతోపాటు ఆదివారం రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గౌరీపరమేశ్వరుల ప్రతిమలను సోమవారం ఉదయం గ్రామంలోని అన్ని వీధుల్లోనూ ఊరేగింపు చేసి ఘనంగా నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తండూరార్చన



పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

కె.కోటపాడు : కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రామాలయంలో ఆదివారం తండూరార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యసాయి బాల వికాస్ తరగతులకు హాజరవుతున్న విద్యార్థులతో గణపతిపూజ, ఓంకారం, వేద గాయత్రి, సాయి గాయత్రి పూజలను బాల వికాస్ గురువులు మురళి, బండారు రామలక్ష్మి, జ్యోత్స్న, ధరణి జరిపారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు సత్యసాయి భక్తులకు బోధించిన బోధనలను బాల వికాస్ తరగతులను వివరించారు.

శుభ్రంగా గాలికొదిలేశారు...!



నిరుపయోగంగా ఉన్న దుమ్ము, ధూళి శుభ్రం చేసే యంత్రం



మూలకు చేరిన మినీ జేసీబీ యంత్రం

- దుమ్ము ధూళితో పుర ప్రజల అవస్థలు
- మూలకు చేరిన రూ.లక్షల విలువైన యంత్రాలు

నర్సీపట్నం : పట్టణంలో రహదారులపై దుమ్ము, ధూళిని ఊడ్చి పడేసి పట్టణాన్ని అద్దంలా ఉంచే యంత్రాలు మూలకు చేరాయి. పట్టణంలో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రహదారుల్లో దుమ్ము, మట్టిని ఊడ్చే యంత్రం, మినీ జేసీబీ యంత్రాలను రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. వాటిని వినియోగించి రోడ్లను శుభ్రపరిచేవారు. నేడు నర్సీపట్నం పురపాలక సంఘం సీబీఎం కాపౌండ్ సమీపంలో మినీ రిజర్వాయర్ల అవరణలో అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. రెండు, మూడు నెలల పాటు వీటితో రహదారుల పరిశుభ్రం, జేసీబీతో మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేశారు. తరువాత వీటి నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో రూ.లక్షల సొమ్ము దుమ్ము, ధూళి పాలైంది.

పురపాలక సంఘానికి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పథకం ద్వారా గత ప్రభుత్వం వాహనాలు సమకూర్చింది. ఇపుడు వాటిని కేవలం డ్రైవర్లు లేరనే కారణంతో వినియోగించుకుండా వదిలేశారు. పురపాలక సంఘంలో 28 వార్డులు ఉన్నాయి. మూడేళ్ల కిందట రహదారులపై చెత్త, దుమ్ము, ధూళి శుభ్రం చేసే యంత్రాలొచ్చాయి. వీటి విలువ రూ.5 లక్షల పైనే ఉంటుంది. వాటితో రెండు, మూడు నెలలు రోడ్లు శుభ్రం చేశారు. ఆ తరువాత మినీ రిజర్వాయర్ల ప్రాంతంలో వాహనాలను నిరుపయోగంగా ఉంచడంతో దమ్ముపట్టిపోయాయి. జేసీబీని పట్టించుకునే వారు లేకపోవడంతో వాటి అద్దాలు పగిలిపోగా, టైర్లు దెబ్బతిన్నాయి. ఇంజిన్ భాగాలు తుప్పుపట్టాయి. ఈ పారిశుధ్య యంత్రాలను తిరిగి వినియోగంలోకి తెస్తే దుమ్మి, ధూళి నుంచి పురప్రజలకు ఉపశమనం కలుగుతుందని, ప్రజాధనం వృథా కాకుండా ఉంటుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. అధికారుల తీరును విమర్శిస్తున్నారు. ఈ విషయంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును వివరణ కోరగా తాను ఇక్కడకు రాకముందు నుంచి అవి నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు.

విస్తారంగా పెసర, మినప సాగు



మాడుగుల మండలం వీజేపురంలో మినప సాగవుతున్న దృశ్యం

నియోజకవర్గంలో 10 వేల ఎకరాల్లో అపరాలు

మాడుగుల : మినప, పెసలు సాగుకు డిమాండ్ పెరగడంతో నియోజకవర్గంలో మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో రబీ పంటలుగా మినప, పెసర, పంటలపై దృష్టి సారించారు. నియోజకవర్గంలో 32 వేల ఎకరాల్లో పెసర, మినుములు పంట వేశారు. అపరాలు సాగుకు తక్కువ పెట్టుబడి అధిక, లాభాలు రావడంతో రైతులు విరివిగా సాగు చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు ఇలా

కిలో విత్తనాలకు 2 గ్రాములు కార్బన్‌డిజమ్ మందు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. దుక్కి దున్ని, విత్తనం నాటుకోవడం ద్వారా ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఎదజల్లడం ద్వారా విత్తనం నాటుకుంటే ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, విత్తనం వేసి 30 రోజులు తర్వాత ఇమేజిత్ ఫైర్ అనే కలుపు మందు ఎకరాకు 300 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. నీటిలో కరిగే ఎరువును (19,19; 19) ఎకరాకు కిలో స్ప్రే చేసుకుంటే అధిక ధిగుబడులు వస్తామన్నారు.

ప్రస్తుతం మినప చేలు కొంత మేర ఏపుగా ఎదుగుతున్నాయని, దిగుబడి బాగుంటుందని పేర్కొన్నారు.

నేడు శిరిజాంలో రామాంజనేయ తీర్థం

చీడికాడ : శిరిజాం గ్రామంలో శ్రీ రామాంజనేయ తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

క్వారీ ప్రాంతాల్లో సంచరిస్తే కేసులు తప్పవు



కరక రంగురాళ్ల ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి గస్తీ నిర్వహిస్తున్న గొలుగొండ ఎస్ఐ రామారావు, సిబ్బంది

గొలుగొండ : కరక, సాలికమల్లవరం, పప్పుశెట్టిపాలెం రంగురాళ్ల క్వారీ ప్రాంతాల్లో ఎవరైనా సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని గొలుగొండ ఎస్ఐ రామారావు హెచ్చరించారు. ఆయన శనివారం అర్ధరాత్రి సమయంలో కరక, పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం రంగురాళ్ల ప్రాంతాల్లో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పై మూడు రంగురాళ్ల క్వారీల్లో 144 సెక్షను అమల్లో ఉందని, ఎవరైనా ఇతర వ్యక్తులు ఆ ప్రాంతాల్లో సంచరిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. కరక, సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీలు అటవీశాఖ ఆధీనంగా ఉండగా, పప్పుశెట్టిపాలెం క్వారీ రెవెన్యూ, పోలీసు అధికారులు పర్యవేక్షిస్తారన్నారు.

అంకితభావంతో పనిచేస్తే తప్పక గుర్తింపు



ప్రసాద్‌ను ఘనంగా సన్మానిస్తున్న రఘువర్మ

రోలుగుంట : అంకిత భావంతో విధులను నిర్వహించే ప్రతి ఉద్యోగికి తప్పక గుర్తింపు ఉంటుందని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ అన్నారు. శరభవరం పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించిన ఎ.వి.ఎస్.ప్రసాద్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శనివారం రాత్రి అదే పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రఘువర్మ ఘనంగా ప్రసాద్‌ను సన్మానించారు. 35 ఏళ్ల పాటు విధులు నిర్వహించిన ప్రసాద్ ఉన్నతాధికారులతో పాటు విద్యార్థుల మన్ననలు పొందారని ప్రశంసించారు. కార్యక్రమంలో రోలుగుంట మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ధర్మారావు, దుర్గాప్రసాద్, బోనెల రాము, బి.రమణ పాల్గొన్నారు.

మోదకొండమ్మకు పాదాల బహూకరణ



దాతలను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ సంజీవరావు తదితరులు



పూలు నగలతో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మాడుగుల : ఎం.కోడూరు మోదకొండమ్మకు అదే గ్రామానికి చెందిన రాపర్తి, సూర్యనారాయణ సత్యవతి దంపతులు వివిధ లోహాలతో తయారు చేసిన పాదాలు ఆలయ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొళ్లవిల్లి సంజీవరావు చేతుల మీదుగా సమర్పించారు. అంతకముందు దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, మాజీ కోఆపరేటివ్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేజేపురంలో...

మాడుగుల రూరల్ : కె.జె.పురం మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మెక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల మోదమాంబ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రోడ్డు వేశారు... డ్రైనేజీ మరిచారు

- గ్రామం మధ్యలోనే నిల్వ ఉంటున్న మురుగునీరు
- దుర్వాసనతో గ్రామస్తుల అవస్థలు



చమ్మచింత గ్రామంలో సిమ్మెంటు రోడ్డు వేసి డ్రైనేజీ ముసేయడంతో నిల్వ ఉన్న మురుగునీరు

నాతవరం : గ్రామం మధ్యలో సిమెంటు రోడ్డు వేసి డ్రైనేజీ నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో చమ్మచింత నుంచి సరుగుడు వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తారు రోడ్డు పనులు చేపట్టారు. చమ్మచింత గ్రామంలో తారురోడ్డుకు బదులుగా సిమెంటు రోడ్డు వేశారు. రోడ్డుకు ఇరువైపులా గతంలో ఉన్న డ్రైనేజీ కాలువను పూర్తిగా మూసేశారు. ప్రస్తుతం గ్రామంలో వినియోగించే నీరంతా ఈ డ్రైనేజీల ద్వారా ప్రవహించేందుకు మార్గం లేక పోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతోంది. మురుగునీరంతా గ్రామం మధ్యలో నిల్వ ఉండిపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈచుట్టు పక్కల నివాసం ఉండేవారు అనేక అవస్థలు పడుతున్నారు. దోమల కారణంగా జ్వరాలు వ్యాప్తిస్తాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సిమెంటు రోడ్డుకు ఇరువైపులా గతంలో ఉండే డ్రైనేజీని యథావిధిగా నిర్మించి మురుగు పోయే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామం మధ్యలో సిమెంటు రోడ్డు వేస్తున్నారని ఆనందించిన గ్రామస్తులు ఇపుడు డ్రైనేజీ మురుగు కూపంలా మారడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీసమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు



తాండవ హైస్కూల్లో జ్ఞాన సరస్వతి పూజలు



చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు



పెదబొడ్డేపల్లి జ్ఞాన సరస్వతి ఆలయంలో అక్షర అభ్యాసానికి హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు

తోడ్పాటు అందించిన పూర్వ విద్యార్థులు

నాతవరం : ఎంతో చరిత్ర కలిగిన తాండవ హైస్కూల్‌లో ఆదివారం 150మంది చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తాండవ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ఉన్న జ్ఞాన సరస్వతి విగ్రహం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. మధ్యాహ్న భారీ అన్న సమారాధన జరిపారు. పాఠశాలలు ఏర్పాటు చేసిన దగ్గర్నుంచి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. నాడు తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి సత్కరించారు. తరువాత పూర్వవిద్యార్థుల సమావేశం నిర్వహించారు. పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పాటు అందించాలని తీర్మానించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ పండగ వాతావరణంలో ఈ అక్షరాభ్యాసాలు జరగడం అభినందనీయమన్నారు. అక్షరాభ్యాసానికి వచ్చిన చిన్నారులందరికీ పలక ఇతర సామాగ్రిని పూర్వ విద్యార్థి చమ్మచింత గ్రామానికి చెందిన న్యాయవాది అప్పన రాజుబాబు తన సొంత ఖర్చుతో సమకూర్చారు. హైస్కూల్‌లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు.



ఎ.కోడూరులో గల సరస్వతిదేవి విగ్రహం

నేడు సామూహిక అక్షరాభ్యాసాలు

కె.కోటపాడు : మండలంలో ఎ.కోడూరు హైస్కూల్లో గల సరస్వతీ దేవి మందిరంతో పాటు కె.కోటపాడు అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల, చౌడువాడ సాయి విద్యా విహార్ పాఠశాలల్లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమాన్ని జరపనున్నారు. వసంత పంచమి పర్వదినం సందర్భంగా పాఠశాలల్లో చేరించే విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



సరస్వతిదేవి ఊరేగింపులో చిడతల కోలాటం

నర్సీపట్నం : వసంత పంచమిని పురస్కరించుకుని మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, విశ్రాంత ఉపాధ్యాయుడు బాబూరావు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం చిన్నారులకు పలకలు, సరస్వతి దేవి చిత్రపటాలను అందజేశారు. సరస్వతి దేవి విగ్రహాన్ని ఊరేగించారు. ఊరేగింపులో చిన్నారులు, మహిళల చిడతల కోలాటం విశేషంగా అకట్టుకుంది.

చదవడం ఇష్టంగా చేసుకోవాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకరరావు

నర్సీపట్నం : చదవడం ఇష్టంగా చేసుకోవాలని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకరరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమయం దొరికినప్పుడల్లా గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలన్నారు. పిల్లలకు అవసరమైన రకరకాల కథల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారి పి.దమయంతి కథల పుస్తకాలను విద్యార్థులతో చదివించి, వాటిలోని సారాంశాలను వివరించారు. చదవడం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు.

చిత్తశుద్ధితో పార్టీకి సేవలు అందిస్తా..

జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు శోలం రమేష్



మాడుగుల రూరల్ : గ్రామ సర్పంచ్ నుంచి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రెండోసారి నియమించినందుకు పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి వుంటానని శోలం రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ గ్రామ వలంటీరు నుంచి శంకరం గిరిజన గ్రామానికి సర్పంచ్ స్థాయికి తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ పార్టీకి దక్కుతుందన్నారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు ఆశీస్సులతో రెండవసారి తనకు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించారని అన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారకులైన ఎంపీపీ రాజారామ్, జెడ్పీటీసీ సభ్యులు రమణమ్మ, మాజీ ఎంపీపీ పెదబాబు, ఇతర పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నట్టు పేర్కొన్నారు.

విస్తారంగా వంగతోట సాగు



గవరపాలెంలో సాగులో ఉన్న వంగతోట

కె.కోటపాడు : మెట్టప్రాంత గ్రామాలలో గల రైతులు విస్తారంగా వంగ పంట సాగు చేస్తున్నారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో నీటి లభ్యత గల సాగునీటి చెరువులు, వ్యవసాయ బావులు సమీపంలో గల భూముల్లో వంగ పంట వేశారు. వంగ సాగుకు దుక్కులు, ఎరువులు, విత్తనాలు, సస్యరక్షణ మందులకు ఎకరానికి రూ.10వేల వరకు పెట్టుబడి ఖర్చులు అవుతున్నాయని రైతులు తెలుపుతున్నారు. డి.అగ్రహారం, పింద్రంగి, లంకవానిపాలెం, దాలివలస, బొట్టవానిపాలెం, ఆర్లి, కె.సంతపాలెం, గవరపాలెం గ్రామాల్లో సుమారు 110 ఎకరాలలో వంగ సాగుచేస్తున్నారు. మూడు నెలల కాలవ్యవధి లోనే పంట దిగుబడి వస్తుందని తెలిపారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

కశింకోట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ కార్మికులు ఆదివారం మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిల్డింగ్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాదాలకు గురైన ఎలక్ట్రీషియన్, ప్లంబర్, తాపీ మేస్త్రీలకు బోర్డు ద్వారా ఆర్థిక సహాయం అందించాలన్నారు. 20 ఏళ్ల క్రితం ఉన్న ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించి నిర్మాణాలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మంచు'పల్లె'కీ



బుచ్చెయ్యపేట రోడ్డులో మంచులో వెళ్తున్న వాహనదారులు



పంట పొలాలను కమ్మేసిన పొగమంచు



వడ్డాది పెద్దేరు వంతెనపై దట్టంగా పొగమంచు

సాధారణంగా మంచు తెరల్లో ప్రకృతి అందాలు తిలకించడానికి అరకు, సీలేరు, పాడేరు, చింతపల్లి తదితర దూర ప్రాంతాలకు వెళ్లే ప్రకృతి ప్రియులు ఇపుడు మైదానప్రాంతాల్లో దట్టమైన పొగమంచును చూసి ఆస్వాదిస్తున్నారు. రాత్రి 7 గంటల నుంచి తెల్లవారు జాము 9 గంటల వరకు పొగమంచు కమ్ముకుంటున్నది. వాహనదారులు పగలే లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణాలు సాగిస్తున్నారు. బుచ్చెయ్యపేట, వడ్డాదిలో కనిపించిన దృశ్యాలివి.

–బుచ్చెయ్యపేట

4 నుంచి కన్యకా పరమేశ్వరి శత జయంత్యుత్సవాలు

అనకాపల్లి: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి శత జయంతి ఉత్సవాలు ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్టు ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు తెలిపారు. అమ్మవారి ఆలయంలో కమిటీ సభ్యులతో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. భీష్మ ఏకాదశి రోజున అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరిగిందన్నారు. శతజయంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 4న 1000 మందితో శోభాయాత్ర జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు ఆలయంలో పూజా కార్యక్రమం, 5న సామూహిక లక్ష తులసి నామార్చనలు, 6న నగరేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 108 మంది సుహాసినిల పూజ, 7న లక్ష కుంకుమ నామార్చనలు, చండీహోమం, ఏకోత్తర సహస్ర (1001) కలశ మండపారాధన, 8న అమ్మవారికి 1001 కలశాలతో ఏకోత్తర సహస్ర పూజ, మహా కుంబాభిషేకం, మధ్యాహ్నం అన్నసమారాధన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.